

టన్ను చీనీ రూ.24,300

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24.300 వేల ప్రకారం పలికాయి.



కిలో టమాట రూ.10

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.10, కనిష్టంగా రూ.6, సరాసరిన రూ.8 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం 37.6°/ 13.5°

జిల్లా అంతటా గురువారం చలి వాతావరణం కొనసాగుతోంది. పగటి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సిలిండర్ల అక్రమ వినియోగంపై కొరడా



స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో జేసీ, అధికారులు

అనంతపురం అర్బన్: గృహావసర వంట గ్యాస్ సిలిండర్లను అక్రమంగా వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న హోటళ్లపై పౌర సరఫరాల శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. 82 డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేశారు. జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ ఆదేశాల మేరకు గురువారం ఇన్‌చార్జ్ డీఎస్‌ఓ జగన్‌మోహన్‌రావు నేతృత్వంలో సీఎస్‌డీటీలు మూడు బృందాలుగా ఏర్పడి నగర పరిధిలోని హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, ప్రైవేటు హాస్టళ్లు, ఇతర వాణిజ్య సంస్థలపై ఆకస్మిక దాడులు చేశారు. ఏటీఎల్ సిలిండర్లు 23, బీపీసీఎల్ సిలిండర్లు 17, హెచ్‌పీసీఎల్ సిలిండర్లు 42 మొత్తం 82 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వ్యక్తులపై 6–ఏ కేసులు నమోదు చేశారు. గృహావసర సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జేసీ ఈ సందర్భంగా హెచ్చరించారు.

అధికంగా వసూలు చేయొద్దు

'గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో వినియోగదారుల నుంచి డెలివరీ బాయ్స్ అదనపు మొత్తం వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే ఏజెన్సీలపై కఠిన చర్యలు తప్పవు' అని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ గ్యాస్ ఏజెన్సీల డీలర్లను హెచ్చరించారు. జాయింట్ కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జిల్లా సరఫరాల అధికారి జగన్‌మోహన్‌రావుతో కలిసి అధికారులు, గ్యాస్ ఏజెన్సీల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎస్‌డీటీలు తమ పరిధిలోని గ్యాస్ ఏజెన్సీలను తరచూ తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా సిలిండర్ డెలివరీ సమయంలో అదనంగా డబ్బులు వసూలు చేయడాన్ని ఉపేక్షించకూడదని చెప్పారు. అదనంగా వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే వెంటనే విచారణ చేయించి నివేదిక పంపించాలని ఆదేశించారు. ఈ విషయంలో కఠినంగా వ్యవహరించాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో డీలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వో చంద్రశేఖర్‌పై బదిలీ వేటు

తాడిపత్రి రూరల్: 'రేషన్‌కార్డు కావాలంటే నీ కూతురిని నా వద్దకు పంపించు' అన్న వీఆర్‌ఓపై బదిలీ వేటు పడింది. వీఆర్‌ఓ తనను వేధిస్తున్నారంటూ వారం క్రితం బాధితురాలు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో కలకలం రేగింది. దీనిపై ఆర్డీఓ కేశవనాయుడు, తాడిపత్రి ఏఎస్పీ రోహిత్‌కుమార్ బాధితురాలిని విచారించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు పంపారు. ఈ క్రమంలోనే వీఆర్వో చంద్రశేఖర్‌ను గుంతకల్లుకు బదిలీ చేసినట్లు గురువారం తహసీల్దార్ రజాక్‌వలి తెలిపారు.

కాటేస్తున్న కాల్‌నాగులు



- ఆడిట్ కార్యాలయ విశ్రాంత రికార్డు అసిస్టెంట్ కె.రమేష్‌బాబు అనంతపురంలో కిరాణా కొట్టు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వ్యాపారం కోసం తనకు పరిచయమున్న మహిళా కానిస్టేబుల్ (గార్లదిన్నె పీఎస్) భర్త మల్లితో రూ.లక్ష అప్పు చేశారు. సక్రమంగా కంతులు చెల్లిస్తున్నా... ఉద్దేశపూర్వకంగా మల్లి ఫోన్లు చేస్తూ దుర్భాషలాడేవాడు. ఈ నెల 10, 11 తేదీల్లో వందకు పైగా కాల్స్ చేశాడు. రమేష్ బాబు భార్య లక్ష్మీదేవికి ఫోన్ చేసి అసభ్యంగా మాట్లాడాడు. రూ.లక్షకు గాను వడ్డీ, అసలు పోను రూ. 27 వేలు చెల్లించాల్సి ఉందని, రోజూ తన కోరిక తీరిస్తే రూ.400 చొప్పున తగ్గిస్తూ ఈ మొత్తాన్ని మాఫీ చేస్తానంటూ నీచంగా వేధించాడు. విషయాన్ని కానిస్టేబుల్ దృష్టికి తీసుకెళ్తే ఆమె కూడా అవమానకరంగా మాట్లాడింది. 'కానిస్టేబుల్ భర్త కదా.. ఆ మాత్రం మాట్లాడతాడు మరి' అంటూ చులకన చేసింది. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం బాధితురాలు ప్రెస్‌మీట్ పెట్టి కన్నీటితో తన బాధను చెప్పుకున్నారు.

- కణేకల్లు మండలం హనకనహాళ్ గ్రామానికి చెందిన గోవిందరాజులు, రామాంజినమ్మ దంపతులు. ఏడేళ్ల క్రితం అనంతపురానికి వలస వచ్చి చంద్రబాబు కొట్టాలలో అద్దె ఇంట్లో నివాసం ఉండేవారు. గోవిందరాజులు స్థానికంగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. పిల్లల చదువుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద కొంత అప్పు చేయగా.. వడ్డీ భారం పెరిగి రూ.3 లక్షలకు చేరుకుంది. అప్పు ఇచ్చిన వారు వేధిస్తుండటంతో ఇటీవల గోవిందరాజులు స్వగ్రామానికి వెళ్లాడు. 'వడ్డీ'రాయుళ్లు గ్రామానికే చేరుకుని అప్పు తీర్చాలంటూ తీవ్ర ఒత్తిడి చేయడంతో.. దిక్కుతోచని గోవిందు ఈ నెల 14న ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటి పెద్ద దిక్కు మృతితో భార్యా పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపించారు.



నిద్దరోతున్న నిఘా..

'వడ్డీ జలగల'పై గట్టి నిఘా ఉంచడంలో పోలీసులు పూర్తిగా విఫలమవుతున్నారు.స్పెషల్ బ్రాంచి, ఇంటెలిజెన్స్ పోలీసులు సక్రమంగా పనిచేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫలితంగా ప్రజలు వడ్డీజలగల వలలో చిక్కుకుని ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



- పట్టి పీడిస్తున్న 'వడ్డీ' జలగలు
- అసలుకు నాలుగింతలు కట్టినా వేధింపులు
- పోలీసుల తూతూమంత్రపు చర్యలు
- తల్లడిల్లిపోతున్న బాధితులు

అనంతపురం: జిల్లాలో 'కాల్‌నాగులు' బుసకొడుతున్నాయి. అవసరానికి అప్పు తీసుకున్న పాపానికి సామాన్యులను నిత్యం వేధిస్తున్నాయి. అసలుకు నాలుగింతల వడ్డీ కలిపి ముక్కుపిండి వసూలు చేస్తున్నాయి. అప్పు తీసుకున్న వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని రెచ్చిపోతూ మానవత్వం మరిచి నీచంగా ప్రవర్తిస్తున్నాయి. బాధితులు ఆత్మహత్యలు చేసుకునేలా పురిగొల్పుతున్నాయి.

పొలంలోనే ఉరి..

వడ్డీ జలగల వేధింపులు తట్టుకోలేక కొందరు గ్రామాలు వదిలి వెళ్లిపోతుంటే.. మరికొందరు ఉన్న ఆస్తులన్నీ అమ్ముకుని రోడ్డున పడుతున్నారు. ఈ నెల 11న అప్పుల బాధ తాళలేక కణేకల్లు మండలం గంగలాపురం గ్రామానికి రైతు హరిజన రాజు ఆత్మహత్య చేసుకున్నారు.ఈయనకు భార్య రామలక్ష్మి, ఐదేళ్లలోపు వయసున్న కుమారులు ఇద్దరు, ఆరు నెలల వయసున్న కుమార్తె ఉండటం గమనార్హం. గ్రామంలో ఆరున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకున్న హరిజన రాజు.. పంటల సాగు కోసం రూ. 8 లక్షల వరకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు చేశాడు. ఇటీవల అప్పు తీర్చాలంటూ వడ్డీ వ్యాపారులు గొడవలకు దిగుతుండటంతో మానసిక ఒత్తిడికి లోనై మంగళవారం రాత్రి పొలంలోనే చెట్టుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

'కాల్ నాగుల' పడగలో 'అనంత'..

అనంతపురం నగరంలో అయితే వీధివీధిలో వడ్డీ జలగలు కనిపిస్తున్నాయి. తమ వీధిలో ఎవరు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని మరీ సాయం కావాలంటూ బాధితులను ఆశ్రయిస్తున్నట్లు తెలిసింది. ఒకప్పుడు రూ.100కు వడ్డీ రూ.5 అంటే అమ్మో అనుకునేవారు. తర్వాత అది రూ.10 అయ్యింది. ప్రస్తుతం రూ.20 నుంచి రూ.25కు పెరిగింది. ఇటీవల నగరంలో ఓ యువకుడికి అత్యవసరం పడగా స్థానికంగా వడ్డీవ్యాపారి నుంచి రూ.50 వేలు తీసుకున్నారు. 20 రోజుల అనంతరం డబ్బు తీసుకు వెళ్లగా.. రూ.10 వేలు వడ్డీ ఇవ్వాలని చెప్పడంతో యువకుడు కంగుతిన్నాడు. గత్యంతరం లేక అడిగినంత చేతిలో పెట్టి అక్కడి నుంచి వెనుతిరిగాడు. ఇచ్చిన డబ్బు కొన్ని రోజుల్లోనే వసూలు కావడం, ఆ తర్వాత వచ్చేదంతా కొసరు కావడంతో చాలా మంది ఈ దందాను ఎంచుకున్నట్లు తెలిసింది.

ఫిర్యాదు చేస్తే చర్యలు

అధికంగా వడ్డీలు వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవు. వడ్డీ వ్యాపారుల వేధింపులపై ఫిర్యాదు చేస్తే తప్పని సరిగా కేసు నమోదు చేస్తాం. ప్రజల పక్షాన పోలీసు వ్యవస్థ ఉంటుంది. బాధితులు ధైర్యంగా ముందుకు రావాలి.

– వి. శ్రీనివాస రావు, డీఎస్పీ, అనంతపురం

జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జిగా జస్టిస్ రామకృష్ణ

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జిగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ నియమితులయ్యారు. సాధారణంగా హైకోర్టు న్యాయమూర్తులను ప్రతి జిల్లాకు అడ్మినిస్ట్రేటివ్ జడ్జిగా నియమిస్తారు. ఇది వరకు పోర్ట్‌ఫోలియో జడ్జిగా ఉన్న జస్టిస్ కే. శ్రీనివాస్ రెడ్డికి పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా కేటాయించారు.

ఘనంగా రంగనాథుడి పార్వేట



పల్లకీ సేవలో రంగనాథుడు

గుత్తి రూరల్: తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు గురువారం స్వామికి హంసవాహన, పార్వేట అశ్వ వాహన సేవను ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆదిశేషయ్య, రాఘవేంద్రాచార్యులు, పలుకూరి రవికుమార్, చేతన్‌వర్మ, లిఖిల్‌వర్మ, నవీన్‌కుమార్, ఉదయ్‌కుమార్‌లు స్వామికి విశేష పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకిపై ఉంచి జమ్మి చెట్టు వరకూ ఊరేగించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. తిరునాలకు వచ్చిన భక్తులకు మాణిక్య రంగనాథ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. తాగునీటి వసతి కల్పించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు, మాణిక్య రంగనాథస్వామి ఆలయ ధర్మకర్త మాకం శ్రీకాంత్, గ్రామ పెద్దలు చిన్న రెడ్డియాదవ్, రంగస్వామిరెడ్డియాదవ్, డేగా మద్దిలేటి, సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్, సురేష్ పాల్గొన్నారు.

వివరాలు లేకుండా జనన ధ్రువీకరణ పత్రం

- హాస్టల్ విద్యార్థులతో ఇబ్బందులు
- 'ఫోన్‌ఇన్'లో కలెక్టర్ వినోద్‌కుమార్‌కు పలువురి ఫిర్యాదు

అనంతపురం అర్బన్: వివరాలు లేకుండా జనన ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని ఓ బాధితుడు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ వద్ద వాపోయారు. వైద్యారోగ్య సేవలపై కలెక్టర్ గురువారం నగరంలోని ఆకాశవాణి కేంద్రం నుంచి 'అనంత మిత్ర ఫోన్‌ఇన్' కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. దాదాపు 15 మంది తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ల్యాబ్ టెక్నీషియన్ నియామకాలు చేపట్టాలని ఒకరు కోరారు. దివ్యాంగుల సర్టిఫికెట్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి వచ్చిన యూడీఐడీ (యూనిక్ డిసెబులిటీ ఐడెంటిటీ) అమలు చేయాలని ఒకరిద్దరు విజ్ఞప్తి చేశారు. పంచాయతీ, భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఫిర్యాదులను పరిశీలించి ప్రతి సమస్యను పరిష్కరిస్తామని ప్రజలకు కలెక్టర్ హామీ ఇచ్చారు. ముఖ్యంగా మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ ఈ.భ్రమరాంబదేవి, డీసీహెచ్‌ఎస్ పాల్ రవికుమార్, ఆకాశవాణి ప్రోగ్రామ్ డైరెక్టర్ నాగేశ్వరెడ్డి పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

ఫిర్యాదుదారు: నా పేరు ప్రదీప్‌కుమార్. మాది కూడేరు మండలం ఎంఎంపల్లి గ్రామం. జనన ధ్రువీకరణ పత్రాల మంజూరులో ఇబ్బంది పెడుతున్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

సర్టిఫికెట్లలో వివరాలు తప్పుగా నమోదు చేస్తున్నారు. నా కుమారుని జనన ధ్రువీకరణ పత్రం కోసం 70 రోజుల క్రితం దరఖాస్తు చేశాను. వివరాలు, రికార్డులు సరిగ్గా లేవని చెబుతున్నారు.

కలెక్టర్: ధ్రువీకరణ పత్రాల్లో తప్పులు నమోదు చేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. ధ్రువపత్రంలో నమోదైన తప్పులను సరిదిద్దేలా చూస్తాం.

ఫిర్యాదుదారు: నా పేరు మల్లీశ్వరి. మాది పెద్దపప్పూరు గ్రామం. ఇక్కడున్న బీసీ హాస్టల్ చాలా అధ్వానంగా ఉంది. విద్యార్థులు పొగ తాగుతున్నారు. హైస్కూల్ కూడా హాస్టల్‌కు దగ్గరగా ఉంది. బాలికలు, చుట్టుపక్కల వారికి ఇబ్బందికరంగా మారింది.

కలెక్టర్: హాస్టల్‌లో అధికారులతో తనిఖీ చేయిస్తాం. తప్పుగా ప్రవర్తిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం. స్థానిక సీఐ, ఎస్‌ఐని అప్రమత్తం చేసి బీట్ ఏర్పాటు చేయిస్తాం.

ఫిర్యాదుదారు: నా పేరు నక్క శ్రీనివాసులు. పామిడి మండలం దేవరపల్లి గ్రామంలో ఉన్న మా పొలాన్ని దాయాదులు ఆక్రమించుకుంటున్నారు. చర్యలు తీసుకుని న్యాయం చేయాలి.

కలెక్టర్: మీ పొలం వివరాలను తీసుకుని అధికారుల ద్వారా విచారణ చేయిస్తాం. న్యాయం జరిగేలా చూస్తాం. సర్వేయర్ హద్దులు చూపినప్పుడు రాళ్లు ఏర్పాటు చేసుకోవాలి. కుటుంబంలో ఆస్తి తగాదాలు ఉంటే చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలి.

ఇంటి పట్టా మంజూరుకు చర్యలు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వ నిబంధనల మేరకు క్రమబద్ధీకరణ పథకం కింద ఇంటి పట్టా మంజూరుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. అనంతపురం రూరల్ పరిధిలోని కక్కలపల్లి గ్రామంలో క్రమబద్ధీకరణ పథకం– 2025 కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారు మేకల మేరీ ఇంటికి కలెక్టర్ గురువారం స్వయంగా వెళ్లి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుతో కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఆక్షేపణ లేని ప్రభుత్వ భూముల్లో ఇల్లు కట్టుకున్న వారు దరఖాస్తు చేసుకుంటే పట్టా మంజూరు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. 150 చదరపు గజాల ప్రభుత్వ స్థలానికి పైబడి ఆక్రమించుకుని నివాసం ఉన్న వారు... 15 శాతం నుంచి 200 శాతం వరకు మార్కెట్ ధరను చెల్లిస్తే క్రమబద్ధీకరణ చేస్తామని కలెక్టర్ వివరించారు. ఆయన వెంట ఆర్డీఓ కేశవనాయుడు, రూరల్ మండల తహసీల్దార్ మోహన్ కుమార్, సర్వేయర్ రఘునాథ్, వీఆర్‌ఓ, పంచాయతీ కార్యదర్శి హిదాయతుల్లా ఉన్నారు.

ఆన్‌లైన్ స్నేహంతో జాగ్రత్త

- సైబర్ మోసగాళ్ల వలలో పడొద్దు
- ఎస్పీ పి. జగదీష్


అనంతపురం: ఆన్‌లైన్ స్నేహం పట్ల జాగ్రత్త అవసరమని ఎస్పీ పి. జగదీష్ అన్నారు. 'సైబర్ సేఫ్ అనంతపురం' కార్యక్రమాన్ని జేఎన్‌టీయూ (ఏ)లో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలు, బ్యాంకు అధికారులు, విద్యార్థులు, ఎన్జీఓలు, మీడియా భాగస్వామ్యంతో ప్రజల్లో సైబర్ మోసాలపై అవగాహన కల్పించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు మూడు డిజిటల్ వాహనాలను ప్రారంభించామన్నారు. ఈ నెల 26వ తేదీ వరకు వివిధ రూపాల్లో అవగాహన కల్పిస్తారన్నారు. బలహీన పాస్‌వర్డ్‌లు, అవగాహన లేకుండా క్లిక్ చేసే లింక్స్ సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్నాయన్నారు. 'సైబర్ సురక్ష' కార్యక్రమం ద్వారా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, విద్యార్థులు, బ్యాంకు అధికారులు, మీడియా ప్రతినిధులను భాగస్వాములను చేస్తున్నామన్నారు. చిన్న చోరీ నుంచి పెద్ద దోపిడీ వరకు జిల్లా ప్రజలు ఏడాదిలో రూ. 5 కోట్ల సొమ్ము పోగొట్టుకుంటే.. అదే సైబర్ నేరాల్లో రెండు సంవత్సరాల్లో రూ.53 కోట్లు కోల్పోయారని ఎస్పీ తెలిపారు. పోలీసులు ఎప్పుడూ డిజిటల్ అరెస్టులు చేయరని, అలాంటి ఫేక్ కాల్స్ వస్తే ధైర్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. యాప్స్ ద్వారా లోన్ తీసుకుంటే జీవితాంతం బాధపడాల్సి వస్తుందన్నారు. మహిళలు, యువత ఆన్‌లైన్ స్నేహాల పట్ల జాగ్రత్తగా ఉండాలని హితవు పలికారు. పార్ట్‌టైం జాబ్ ఆఫర్లు, ఇంటర్నెట్, మెసేజింగ్ ప్లాట్‌ఫాం తదితర ప్రకటనలకు ఆకర్షితులు కాకూడదన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ (ఏ) ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ రమేష్, లీడ్‌బ్యాంకు మేనేజర్ నరసింగరావు, అనంతపురం అర్బన్ డీఎస్పీ వి. శ్రీనివాస రావు, సీఐలు జాకీర్, ధరణి కిశోర్, క్రాంతికుమార్, రాజేంద్రనాథ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, శాంతిలాల్, కే. సాయినాథ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

సర్కారు తీరు.. టీచర్ల బెంబేలు

- రేపు జిల్లాలో 135 'క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్' సమావేశాలు
- ఒకపూట స్కూళ్లు.. ఇంకోపూట మీటింగులు
- కూటమి సర్కారు వింత నిర్ణయంపై సర్వత్రా విమర్శలు
- ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యులని ప్రశ్నలు



అనంతపురం ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో విద్యావ్యవస్థ అధోగతి పాలవుతోందని టీచర్లు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కొత్తగా క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌లు ఏర్పాటైన తర్వాత సమావేశాల నిర్వహణకు సర్కారు షెడ్యూలు విడుదల చేసింది. ప్రతినెలా మూడో శనివారం ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. ఒకవేళ ఆరోజు సెలవు దినమైతే నాల్గో శనివారం నిర్వహిస్తారు.

భిన్నమంటూనే చిక్కుల్లోకి నెట్టి..

సమావేశాల నిర్వహణపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో అటు విద్యార్థులు, ఇటు టీచర్లకు కొత్త చిక్కులు వచ్చి పడ్డాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి అంశంలోనూ గతానికి భిన్నమంటూ అసంబద్ధ నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది. గతంలో రెండు రోజులు కాంప్లెక్స్ సమావేశాలు జరిగేవి. తొలిరోజు 50 శాతం మంది, తర్వాత రోజు 50 శాతం మంది టీచర్లు హాజరయ్యేవారు. దీంతో ఇబ్బందులుండేవి కాదు. జిల్లాలో గతంలో 155 కాంప్లెక్స్‌లుండేవి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 135 క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్‌లుగా మార్చేశారు. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్‌లో 10 నుంచి 20 స్కూళ్లు ఉంటాయి. ఈనెల 15న తొలి క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జరగనున్నాయి.

ఉదయం స్కూల్, మధ్యాహ్నం మీటింగ్..

ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్కూళ్లు పెట్టుకోవాలి. ఆ తర్వాత ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొనాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాప్తాడు మండలం పాలచెర్ల ప్రాథమిక పాఠశాల టీచర్లు కాంప్లెక్స్ సమావేశానికి బండమీదపల్లికి వెళ్లాలి. పాలచెర్ల నుంచి బండమీదపల్లికి బస్సు సదుపాయం లేదు. 24 కిలోమీటర్ల దూరంలో ఉన్న అనంతపురం వచ్చి ఇక్కడి నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న బండమీదపల్లికి వెళ్లాల్సి ఉంటుంది. అలా వెళ్లాలన్నా...వేళకు బస్సులుండవు. ఉదయం, సాయంత్రం నిర్ణయించిన వేళలకు మాత్రమే ఈ రూటులో బస్సులు తిరుగుతాయి. మరి పాలచెర్లలో పని చేస్తున్న టీచర్లు కేవలం గంట వ్యవధిలో బండమీదపల్లికి వెళ్లడం ఎలా సాధ్యమో అధికారులకే తెలియాలి. జిల్లాలో ఇలాంటి స్కూళ్లు వందల్లో ఉన్నాయి.

విద్యార్థుల పరిస్థితి ఏంటి?

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల తల్లిదండ్రుల్లో కూలీనాలి చేసుకునే వారే ఎక్కువ. వారు ఉదయం పనికి పోయి సాయంత్రం ఇంటికి చేరుకుంటారు. పిల్లలు తాము చదువుకునే పాఠశాలలకు బస్సుల్లో వెళ్తుంటారు. చాలా గ్రామాలకు ఉదయం, సాయంత్రం బడుల సమయాల్లో తప్ప ఇతర వేళల్లో బస్సులు తిరగవు. స్కూల్ కాంప్లెక్స్ మీటింగ్ నిమిత్తం 12 గంటలకు బడులు వదిలితే.. ఆ తర్వాత విద్యార్థులు ఇళ్లకు ఎలా చేరుకుంటారనేది ఆందోళన కల్గిస్తోంది.

గంటలో టీచర్లు ఎలా చేరుకుంటారు?



కాంప్లెక్స్ సమావేశాలకు హాజరయ్యే ఉపాధ్యాయులు మధ్యాహ్నం 12 గంటల వరకు స్కూళ్లలో ఉండి తర్వాత 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో ఉండే క్లస్టర్ స్కూల్‌కు ఎలా చేరుకుంటారో ప్రభుత్వానికే తెలియాలి. తొందరలో ఉపాధ్యాయులకు ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. సమావేశాలు సౌకర్యవంతంగా నిర్వహించేలా చూడాలి.

– గౌని పాతిరెడ్డి, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

విద్యార్థులకూ ఇబ్బందులే..



ఉదయం 11.45 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పెట్టిన తర్వాత స్కూళ్లు వదిలేయాలని చెబుతున్నారు. ఆ సమయంలో చాలామంది పిల్లలు వారి ఇళ్లకు చేరుకోవడం తీవ్ర ఇబ్బందిగానే ఉంటుంది. తల్లిదండ్రులు కూడా అందుబాటులో ఉండరు. మరెలా పోతారు. ఎవరిది బాధ్యత. అక్కడి నుంచి గంటలోపు కాంప్లెక్స్ స్కూళ్లకు చేరుకోవాలంటే ఇబ్బంది పడాల్సి ఉంటుంది.

–గోవింద రెడ్డి, వైఎస్సార్‌టీఏ రాష్ట్ర ఉపాధ్యక్షులు

అశ్వవాహనం అధిష్టించి.. భక్తులను కటాక్షించి



అశ్వవాహనంపై కొలువుదీరిన కొండమీదరాయుడు

బుక్కరాయసముద్రం: కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి శ్రీవారు అశ్వవాహనంపై ఊరేగారు. అర్చకులు ముందుగా స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం వేద మంత్రాల నడుమ మంగళ వాయిద్యాలతో పుర వీధులలో శ్రీవారిని ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు స్వామి వారికి అడుగడుగునా హారతులు పట్టి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కాగా, స్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి.ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం 8 గంటలకు తీర్థవాది వసంతోత్సవం నిర్వహిస్తారు. రాత్రి కొండమీదరాయుడికి హంస వాహన సేవ ఉంటుందని అర్చకులు శ్రీనాథ్ స్వామి తెలిపారు.

నేటి నుంచి బాలోత్సవం

- అనంతపురంలోని లలిత కళాపరిషత్తు వేదికగా



ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: చిరుప్రాయం నుంచే పిల్లల్లో శాస్త్రీయ దృక్పథం పెంచేలా బాలోత్సవం వేడుకలకు అనంతపురంలోని లలిత కళాపరిషత్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఈ నెల 14, 15, 16 తేదీల్లో బాలోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను గురువారం ఉదయం బాలోత్సవం నిర్వాహక కమిటీ చైర్మన్ షమీం షఫీవుల్లా, ఐద్వా సావిత్రి, జిలాన్, శ్రీనివాసరావు తదితరులు పరిశీలించారు. రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యా సంబంధమైన అంశాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు క్రీడల పోటీలతో 200కు పైగా పాఠశాలలకు చెందిన 8 వేల మంది బాలబాలికలు సందడి చేసేలా ఏర్పాట్లు చేశారు. ఆయా కార్యక్రమాల్లో విజేతలకు బహుమతులను అందజేయనున్నారు. శాస్త్రీయ నృత్యాలు, చిత్రలేఖనం, నాటికలు, ఇంగ్లిష్, తెలుగు వార్తారచన, సైన్సు ఎగ్జిబిషన్, ఏకపాత్రాభినయాలు, షార్ట్‌ఫిల్మ్ మేకింగ్, మూకాభినయం, జానపద, వెస్ట్రన్ సంగీతం, దేశభక్తి గీతాలు, కోలాటం వంటి పోటీలు సందడిగా సాగనున్నాయి. విచిత్ర వేషధారణ పోటీలూ ఉంటాయి. పిల్లల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయడానికి ఈ వేదిక ఎంతో దోహదపడుతుందని షమీం షఫీవుల్లా అన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు బాలోత్సవంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.



ప్రేమ ఒక అనిర్వచనీయమైన అనుభూతి. మాటలకు అందని మధుర భావన. రెండక్షరాలనే కాదు రెండు హృదయాలనూ ఒకటి చేయగల మహత్తర సాధనం. అంత గొప్ప ప్రేమను పొందాలని ఎవరైనా అనుకుంటారు. జీవిత గమనంలో అందమైన స్థానం కల్పిస్తూ నవ్వుల పువ్వులలో వికసించాలని ఆనందించే వారి కోసమే 'వాలంటైన్స్ డే' వచ్చి వాలింది. 'కనులు తెరిస్తే జననం, కనులు మూస్తే మరణం. ఇంత చిన్న జీవితంలో కడవరకూ నీతోనే ఉండాలని నా మనసు ఆరాటపడుతోంది. అవకాశం ఇస్తావా ప్లీజ్' అంటూ ఏకమైన రెండు హృదయాలు నేడు ఎంతో అన్యోన్యంగా జీవిస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచాయి. ప్రేమించి.. పెళ్లి చేసుకుని అందరినీ మెప్పించిన జంటల నేపథ్యంపై ప్రేమికుల రోజు సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ప్రేమించి .. మెప్పించి

సందర్భం
నేడు ప్రేమికుల దినోత్సవం

పెద్దలను ఒప్పించి...



గుంతకల్లుకు చెందిన రవితేజ, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన సానియా ఇద్దరి మతాలు వేరైనా ప్రేమ బంధం వారిని ఒక్కటి చేసింది. 2015లో ఎస్కేయూలో పీజీ చేస్తున్న సమయంలో ఇద్దరి మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. మతాలు వేరు కాబట్టి తమ పెళ్లికి పెద్దలు అంగీకరిస్తారో లేదోనని భయపడ్డారు. దీంతో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాక పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో 2020లో వార్డు సచివాలయ ఎడ్యుకేషనల్ సెక్రెటరీలుగా ఇద్దరూ ఉద్యోగాలు సాధించారు. ఇరువైపులా కుటుంబ పెద్దలు ఒప్పించి 2022లో గుంతకల్లులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందరి సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. తమ ప్రేమకు నిదర్శనంగా 2023లో పండంటి మగబిడ్డకు సానియా జన్మనిచ్చారు. తమ ప్రేమను అర్థం చేసుకుని పెళ్లి జరిపించిన ఇరు కుటుంబాల పెద్దలకు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. – గుంతకల్లు టౌన్

మతాలు వేరైనా...



ఉన్నత విద్యను అభ్యసిస్తున్న సమయంలోనే ఉరవకొండకు చెందిన కొత్త శరత్‌కు నంద్యాల జిల్లా నందికొట్కూరుకు చెందిన సాక్షి (మస్రత్ జహ)తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. మతాలు వేరు కావడంతో తమ పెళ్లికి పెద్దలు అడ్డు చెపుతారని భావించారు. జీవితంలో నిలదొక్కుకున్న తర్వాత పెద్దల మనసు జయించి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో మస్రత్ జహ ఎంబీబీఎస్, శరత్ ఎంబీఏ పూర్తి చేశారు. అనంతరం తమ ప్రేమను పెద్దలకు తెలిపి వారి అంగీకారంతో 2020లో వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం ఉరవకొండ సీహెచ్‌సీ వైద్యాధికారిగా సాక్షి పనిచేస్తుండగా తమ ప్రేమకి చిహ్నంగా జన్మించిన కుమార్తె సమైరా పేరుతో పాలీ క్లినిక్‌ను నిర్వహిస్తూ ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ ఉరగాద్రి చౌడేశ్వరి ఆలయ చైర్మన్‌గా ప్రజలకు శరత్ మరింత చేరువయ్యారు. – ఉరవకొండ

అన్యోన్యతే అందరినీ కలిపింది



వైఎస్సార్ జిల్లా ఆర్‌ఎస్ కొండాపురం మండలం ఏటూరు గ్రామానికి చెందిన కె.రాము, నార్పల మండలం కేశేపల్లికి చెందిన సౌజన్య చదువుకుంటున్న సమయంలో ఐదేళ్లుగా ప్రేమించుకున్నారు. ఇద్దరి కులాలు (ఎస్సీ, ఓసీ) కావడంతో కుటుంబ పెద్దలు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా ఇద్దరూ పెద్దలను కాదని 2024, అక్టోబర్ 30న పెళ్లి చేసుకున్నారు. అనంతరం వీరి జీవనం కొంతకాలం కష్టాలమయంగానే సాగింది. రాము ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తూ సౌజన్యను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చాడు. వీరి మధ్య అన్యోన్యతను గమనించిన ఇరువైపులా పెద్దల్లో మార్పు వచ్చింది. కులాల ప్రస్తావన లేకుండా రెండు కుటుంబాలు కలిసిపోయాయి. ప్రస్తుతం రాము, సౌజన్య ఎంతో సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. – యల్లనూరు

రక్త దానంతో ఒక్కటై..



పామిడికి చెందిన బి.రాము హైదరాబాద్‌లోని కొడాక్ బ్యాంకులో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. పామిడిలోని అబ్దుల్ కలాం స్వచ్ఛంద సంస్థ సభ్యుడిగా ఉన్న ఆయన పలు రక్తదానాలను విజయవంతంగా నిర్వహించాడు. ఈ క్రమంలో 2010లో హైదరాబాద్‌లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి అరుదైన రక్తం అవసరం కావడంతో సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడు. గమనించిన అప్పటికే ఎంతోమందికి రక్తదానం చేసిన హైదరాబాద్‌కు చెందిన బి.స్వాతి అనే యువతి వెంటనే ఫోన్ ద్వారా రాముతో మాట్లాడి రక్తదానంతో రోగి ప్రాణాలు కాపాడింది. ఈ పరిచయం వారి మధ్య ప్రేమకు దారి తీసింది. కులాలు (ఎస్సీ, ఓసీ) వేరైనా పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్నారు. 15 ఏళ్ల వీరి అన్యోన్న జీవితానికి నిదర్శనంగా ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. – పామిడి

ప్రేమించడం తప్పు కాదు



ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న సమయంలో గుత్తికి చెందిన ఇస్మాయిల్, రషీదా మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. విషయాన్ని పెద్దలకు తెలిపితే తొలుత పెళ్లికి నిరాకరించారు. దీంతో పెద్దలను ఒప్పించేందుకు వీరికి 11 సంవత్సరాలు పట్టింది. చివరకు ఇరువైపులా కుటుంబసభ్యులు అంగీకారం తెలపడంతో 22 ఏళ్ల క్రితం పెళ్లి చేసుకున్నారు. వీరి అన్యోన్య దాంపత్యానికి చిహ్నంగా ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. ప్రేమించడం ఎన్నటికీ తప్పు కాదని, అయితే పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోకపోవడం చాలా తప్పు అని ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఇస్మాయిల్ దంపతులు అంటున్నారు. ప్రేమలో కోపతాపాలు సర్వసాధారణమే అయినా ఒకరినొకరు అర్థం చేసుకుంటే జీవితం ఎంతో ఆనందంగా ఉంటుందని అన్నారు. – గుత్తి

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా రమేష్‌గౌడ్



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా అనంతపురం జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యుడు చిట్లూరు రమేష్‌గౌడ్‌ను అధిష్టానం నియమించింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటన విడుదల చేసింది.

'హంద్రీ-నీవా'ను బతకనిద్దాం

- ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మల్లికార్జున

అనంతపురం అర్బన్: జిల్లాలో హంద్రీ-నీవా ప్రాజెక్టును ప్రభుత్వం చంపే ప్రయత్నం చేస్తోందని, కూటమి సర్కార్ చర్యలను అడ్డుకుని హంద్రీ-నీవా ప్రాజెక్ట్‌ను బతకనిద్దామంటూ ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున పిలుపునిచ్చారు. గురువారం అనంతపురంలోని ఆ సంఘం కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నప్పయాదవ్ అధ్యక్షతన జిల్లా సమితి సమావేశం జరిగింది. అనంతరం విలేకరులతో మల్లికార్జున మాట్లాడారు. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో సాగునీటి ప్రాజెక్టులను పూర్తికి నిధులు, ప్రతి ఎకరాకూ సాగునీరు, ప్రతి గ్రామానికీ తాగునీరు అందించేలా నికర జలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ సాధనలో భాగంగా మరో మారు ఉద్యమానికి ఊపిరి పోసే దిశగా ఈ నెల 22, 23 తేదీల్లో వైఎస్సార్ జిల్లా కడపలో ప్రాజెక్టుల సదస్సు జరుగుతుందన్నారు. మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు రామకృష్ణ, బండిరామకృష్ణ, రామాంజినేయులు, ఎస్.రామకృష్ణ, రాము, మధుయాదవ్, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గా ఫైనాన్స్ కంపెనీ సిబ్బంది అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

ఉరవకొండ: అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఫేక్ అకౌంట్లు సృష్టించి, నకిలీ బంగారంతో రుణాలు పొందిన ఉరవకొండలోని శ్రీకనకదుర్గా ఫైనాన్స్ కంపెనీ సిబ్బందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను గురువారం స్థానిక పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మహానంది, ఎస్ఐ జనార్దననాయుడు వెల్లడించారు. పట్టుబడిన వారిలో ప్రధాన నిందితుడు, బ్రాంచ్ మేనేజర్ పల్లా ప్రశాంత్ (కూడేరు మండలం మరుట్ల-2 కాలనీ నివాసి), అసిస్టెంట్ మేనేజర్ చాకలి వెంకటేష్ (ఉరవకొండ), ఆడిటర్ రామాంజనేయులు (తాడిపత్రి) ఉన్నారు. వీరు ఫేక్ అకౌంట్లు సృష్టించి నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి రూ.56,62,940 రుణాన్ని పొంది సొంత అవసరాలకు వాడుకున్నారు. ఈ ఏడాది జనవరిలో చేపట్టిన ఆడిట్‌లో ఈ మోసం బట్టబయలైంది. దీంతో అదే నెల 26న కంపెనీ ప్రతినిధి తిరుపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఇదే కేసులో నాల్గో నిందితుడిగా ఉన్న జనరల్ మేనేజర్ జ్వాలా చంద్రశేఖరరెడ్డి ఈ నెల 9న న్యాయస్థానంలో లొంగిపోయారు. గురువారం ఉదయం చిన్నముష్టూరు వద్ద మంతనాలు జరుపుతున్న పల్లా ప్రశాంత్, చాకలి వెంకటేష్, రామాంజనేయులును గుర్తించి పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణ అనంతరం నిందితులపై కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు.

సేవాలాల్ జయంత్యుత్సవాలు ప్రారంభం



సంత్ సేవాలాల్ మహారాజ్ మూలవిరాట్

గుత్తి రూరల్: మండలంలోని చెర్లోపల్లి గ్రామ పంచాయతీ సేవాగఢ్‌లో వెలసిన సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ వరకూ మూడు రోజుల పాటు ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. దేశంలోనే ఏకైక ఆలయం కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి ఇప్పటికే పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుంటున్నారు. దీంతో భక్తులు ఎలాంటి అసౌకర్యాలకు గురి కాకుండా నిర్వాహకులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలకు శుక్రవారం ఉదయం మహారాష్ట్రకు చెందిన మంత్రి సంజయ్ రాథోడ్ రానున్నారు. దీంతో ఎస్పీ జగదీష్ ఆలయం వద్దకు చేరుకుని మంత్రి పర్యటన ఏర్పాట్లను పర్యవేక్షించారు. సిబ్బందితో మాట్లాడుతూ... భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భద్రతను పర్యవేక్షించాలన్నారు. ఆలయం వెనుక ఉన్న రిజర్వాయర్ వద్దకు ఎవరూ పోకుండా చూడాలన్నారు.

28 తర్వాత ఉద్యమ కార్యాచరణ

- పచ్చ పార్టీ కండువా వేసుకుంటేనే సీఎంఆర్ఎఫ్ నిధి ఇస్తారట...!
- కేసులు పెట్టేందుకూ భయపడేలా పనిచేద్దాం
- ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం చంద్రబాబు నైజం
- కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ రంగయ్య, మాజీ మంత్రి శైలు



మాట్లాడుతున్న డాక్టర్ శైలజానాథ్ (చిత్రంలో) మాజీ ఎంపీ తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఈ నెల 28 తర్వాత భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించి ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటాలు సాగిస్తామని కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, మాజీ మంత్రి డాక్టర్ శైలజానాథ్ అన్నారు. స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో గురువారం నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పచ్చపార్టీ కండువా వేసుకుంటేనే సీఎంఆర్ఎఫ్ సహాయ నిధి ఇస్తామని టీడీపీ నేతలు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని, తాను ఎంపీగా ఉన్న సమయంలో రాజకీయాలకు అతీతంగా సీఎంఆర్ఎఫ్ సహాయ నిధి అందించానని రంగయ్య గుర్తు చేశారు. ఈ నెల 28న ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో వెనుకబడిన కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 114 చెరువులను నీటితో నింపడంతో రైతులకు పరిహారం అందిస్తారా? లేదా అనేది వేచి చూస్తామన్నారు. అన్యాయం జరిగితే ఉద్యమ కార్యచరణ రూపొందించి ప్రజా భాగస్వామ్యంతో పోరాటాలు సాగిస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీనీ నెరవేర్చకపోవడం చంద్రబాబు నైజమన్నారు. తనను గెలిపిస్తే పది రోజుల్లోనే నిర్వాసిత రైతులకు పరిహారం అందజేయడంతో పాటు కాలువలు తవ్వి చెరువులకు నీరందిస్తామని గత ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హామీనిచ్చారని, అయితే నేటికీ ఈ పనులు కార్యరూపం దాల్చలేదన్నారు. 'కాంట్రాక్టర్ మీరే. సీఎం కూడా మీ నాయకుడే.. టెండర్లు పిలవండి. ప్రస్తుతమున్న ధరల మేరకు కొటేషన్లు వేయండి. మీ డబ్బుతో కాలువలు తవ్వి మీ ముఖ్యమంత్రి వద్ద బిల్లులు పెడితే అవి వస్తాయి కదా? అయినా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారు' అంటూ సురేంద్రబాబును ప్రశ్నించారు. ఇప్పటికీ 40 శాతం ఓటు బ్యాంకుతో ప్రజల్లో విశేష ఆదరణ ఉన్న ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీనే అన్నారు. పార్టీ ఎక్కడేగానీ ఓడిపోలేదన్నారు. అలాంటప్పుడు భయపడాల్సిన పనిలేదని, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై టీడీపీ నేతలు అక్రమ కేసులు పెట్టేందుకు కూడా భయపడేలా ప్రజల పక్షాన నిలిచి పోరాటం సాగిద్దామని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, కంబదూరు జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీలు కమల నాగరాజు, భీమేష్, భట్టువానిపల్లి అంజి, నాయకులు సుధీర్, గోళ్ల సూర్యనారాయణ, హనుమంతరాయుడు, వడ్డే వెంకటప్ప, పాలబండ్ల చంద్రశేఖర్ రెడ్డి, రేవన్న గౌడ్, ములకనూరు తిమ్మరాయుడు, యర్రంపల్లి కృష్ణమూర్తి, చరణ్, పాతలింగ, నాగలక్ష్మి, షెక్షావలి, సంధ్యారాణి, నరసింహులు, లక్ష్మన్న, పరమేశ్వరప్ప, హరి, అఫ్జల్, హనుమంతరెడ్డి, రామాంజినేయులు, గొర్ల గంగాధర్, సోమశేఖర్‌రెడ్డి, బాషూజీ, విజయ్, హనుమంతప్ప, రామ్మూర్తి, తిప్పేస్వామి, ప్రియాంక, మంజుల, ప్రతాప్, దీప్తు, మల్లి, రాము, కిరీటి యాదవ్, నాగేంద్ర, రామిరెడ్డి, పాండు, జానీ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

నల్లారి రమేష్ ఇంటిపై జేసీ అనుచరుల దాడి

తాడిపత్రి: ఏపీ ప్రజాసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆర్గనైజేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు నల్లారి రమేష్‌నాయుడు ఇంటిపై రెండు రోజుల క్రితం రాత్రి జేసీ అనుచరులు దాడికి ప్రయత్నించినట్లు ఆయన భార్య నాగరాణి తాడిపత్రి పట్టణ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను గురువారం తన భర్తతో కలసి ఆమె 'సాక్షి'కి వెల్లడించారు. ఇంటిపై దాడికి పాల్పడేందుకు వచ్చిన దుండగులు తాము జేసీ అనుచరులమని, నల్లారి రమేష్ నాయుడు ఎక్కడ అంటూ తలుపులు బద్దలు కొట్టేందుకు ప్రయత్నం చేశారన్నారు. విషయాన్ని వెంటనే విజయవాడలో ఉన్న తన భర్తకు ఫోన్ చేసి చెప్పడంతో ఆయన నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఇంటి వద్దకు చేరుకుంటుండగా దుండగులు పారిపోయారన్నారు. ఘటనపై పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశామన్నారు. రమేష్‌నాయుడు మాట్లాడుతూ... తాడిపత్రిలో జేసీ ఆగడాలు, ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ, ఆయన కుమారుడి అక్రమాలపై తరచూ సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించినందుకే వారు తనపై కక్ష గట్టారని ఆరోపించారు. తనకు, తన కుటుంబానికి జేసీ, అంబికా నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.

విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్య కీలకం

- ఇంటర్ విద్య ఆర్‌జేడీ రవి

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యార్థి జీవితంలో ఇంటర్ విద్య అత్యంత కీలకమని ఇంటర్ విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్జేడీ) రవి పేర్కొన్నారు. రెండేళ్లు కష్టపడి చదువుకుని గట్టెక్కితే తర్వాత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. గురువారం జిల్లాలో పర్యటించిన ఆయన ఐదు ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. అనంతరం అనంతపురం నగరంలోని కేఎస్ఎఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులతో సమావేశమై మాట్లాడారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, సంకల్ప స్టడీ మెటీరియల్ పంపిణీపై ఆరా తీశారు. థియరీ పరీక్షల దగ్గర పడుతున్న నేపథ్యంలో అందరూ చదువులపై దృష్టి సారించాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ సోషల్ మీడియా జోలికి వెళ్లొద్దన్నారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను గుర్తు పెట్టుకొని లక్ష్యం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఆయన వెంట జిల్లా పరీక్షల నిర్వాహణ కమిటీ కన్వీనర్, ఆర్ఐఓ ఎం.వెంకటరమణ నాయక్, సభ్యులు వెంకటరంగయ్య, జంతు శాస్త్ర అధ్యాపకుడు జయరాం నాయక్ ఉన్నారు.

'ఈ-పంట' నమోదు తప్పనిసరి

- జేసీ శివ్‌నారాయణ్ శర్మ



పంటను పరిశీలిస్తున్న జేసీ శివ్‌నారాయణ్ శర్మ

రాప్తాడురూరల్: రైతులు సాగు చేసిన ప్రతి పంట వివరాలు తప్పనిసరిగా 'ఈ-పంట'లో నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ సూచించారు. 'ఈ-పంట' సూపర్ చెక్‌లో భాగంగా గురువారం అనంతపురం రూరల్ మండలం సోములదొడ్డిలో రైతు రవి సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేసే పంటల వివరాలు ఈ-పంటలో నమోదు చేయించాలని ఆదేశించారు. ప్రభుత్వ పథకాలను రైతులకు తెలియజేయాలన్నారు. ఎరువుల వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. ఏ పంటకు ఏయే దశల్లో ఎలాంటి మందులు వాడాలో చెబుతుండాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి శశికళ, గ్రామ వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

గార్లదిన్నె: మైనర్ బాలికను వంచించి బాలింతను చేసిన యువకుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు గార్లదిన్నె పీఎస్ ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపారు. వివరాలను గురువారం ఆయన వెల్లడించారు. వజ్రకరూరు మండలం రాగులపాడుకు చెందిన మల్లికార్జున ఐదేళ్లుగా గార్లదిన్నెలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో అదే కాలనీలో నివాసముంటున్న మైనర్ బాలికను తన మాయ మాటలతో లోబర్చుకుని పలుమార్లు అత్యాచారం చేశాడు. దీంతో బాలిక గర్భం దాల్చి రెండు రోజుల క్రితం ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఘటనపై బాధిత బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మల్లికార్జునపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం ఉదయం నిందితుడిని అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఆత్మకూరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం శ్రీనివాసప్రసాద్

ఆత్మకూరు: స్థానిక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారు. జనవరి 27 నుంచి ఈ నెల 10వ తేదీ వరకూ అనంతపురంలోని ఆర్డీటీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-13 రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు అస్మిత, శ్వేత, విష్ణు ప్రణవి తమదైన ఆటతీరుతో రాణించారు. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించే ఏపీ జట్టుకు వారు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను ఆ పాఠశాల హెచ్ఎం శ్రీనివాసప్రసాద్, పీఈటీ గోవర్ధన్ అభినందించారు.

క్లుప్తంగా

పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక



పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఇదే

రాప్తాడురూరల్: పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా రెడ్డివారి నెహెమ్యా నాగరాజు మరోసారి ఎన్నికయ్యారు. అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి సమీపంలోని ఏసుకృపా మందిరంలో గురువారం జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రెడ్డివారి నెహెమ్యా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా పాస్టర్ మార్క్, కార్యదర్శిగా పాస్టర్ ఆనంద్, జాయింట్ సెక్రటరీగా పాస్టర్ మనష్షే, ట్రెజరర్‌గా పాస్టర్ జీవన్‌బాబు, ఈసీ మెంబర్లుగా పాస్టర్ జహంగీర్ జాషువా, పాస్టర్ సుధాకర్, పాస్టర్ విజయసింహ, పాస్టర్ చార్లెస్ నాయక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు నెహెమ్యా నాగరాజు మాట్లాడుతూ.. సేవ చేసేందుకు తమకు మరో అవకాశం ఇవ్వడంతో సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

'క్రైస్తవులపై చిన్నచూపు తగదు'

అనంతపురం కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీల అభివృద్ధిని విస్మరించిందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వై.ప్రసాద్ బాబు పేర్కొన్నారు. గురువారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో క్రైస్తవులకు రూ.151 కోట్లు కేటాయించామని ప్రభుత్వం చెబుతున్నా.. ఏడాది గడిచిపోతున్నా ఒక్క రూపాయి కూడా వెచ్చించలేదన్నారు. ముందు నుంచి క్రైస్తవుల పట్ల కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి క్రైస్తవుల అభివృద్ధికి రూ.కోట్లు వెచ్చించారని తెలిపారు. సమావేశంలో క్రిస్టియన్ మైనార్టీ నాయకులు సతీష్, కిరణ్, సునీల్ కుమార్, అబ్రహాం, సాల్మోన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం సెంట్రల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా వ్యవసాయాధికారిణి ఉమామహేశ్వరమ్మ సూచించారు. గురువారం శారదానగర్‌లో అనంత మహా సమాఖ్య కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారు కంపెనీల డైరెక్టర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ ద్వారా రైతులకు వ్యవసాయ పనిముట్లు, డ్రోన్లు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. అలాగే కందులు, మినీ బియ్యం మిల్లులు రాయితీ ద్వారా ఇస్తున్నామని తెలిపారు. ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, జిల్లా ఉద్యాన అధికారి నరసింహా రావు, కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పారా అథ్లెటిక్స్‌లో అనంతకు అగ్రస్థానం



పతకాలు సాధించిన జిల్లాకు చెందిన పారా అథ్లెటిక్స్

అనంతపురం: రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025 పోటీలు మంగళగిరిలో ఈనెల 2వ తేదీన నిర్వహించారు. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. 20 బంగారు, 19 వెండి, 11 రజత పతకాలను అనంతపురం జిల్లా పారా ఒలింపిక్ క్రీడాకారులు దక్కించుకున్నారు. అశోక్ నగర్‌లోని ఇండోర్ స్టేడియం మీనాక్షమ్మ ఫౌండేషన్ ప్రతినిధులు రవికాంత్ రమణ, విభిన్న ప్రతిభావంతుల ఏడీ వినోద్ కుమార్, డీఎస్‌డీఓ ఉదయ్ భాస్కర్, సాయి ట్రస్ట్ ప్రతినిధి విజయసాయి ముఖ్య అతిథులుగా పాల్గొని క్రీడాకారులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పారా స్పోర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు డీఎస్ఏ కోచ్‌లు అథ్లెటిక్స్ కోచ్ మంజుల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

రాప్తాడు: స్థానిక బీసీ కాలనీలోని నాగులకట్ట వద్ద ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తొలుత ఆలయంలో షిరిడీ సాయిబాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే వేద పండితుడు వాసుదేవరావు చేతుల మీదుగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం ఆలయం వద్ద ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ అన్నదానం చేశారు. మండలంలోని పలు గ్రామాల భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పెద్దసార్లు దూరం.. పీజీలపైనే భారం

- ఓపీల్లో కనిపించని వైద్యులు
- ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు
- సర్వజనాస్పత్రిలో రోగులతో ఆటలు
- గంటల తరబడి వేచి చూస్తున్న వైనం
- పట్టించుకోని సూపరింటెండెంట్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: రోగులతో ప్రభుత్వ సర్వజనాస్పత్రి వైద్యులు ఆటలాడుకుంటున్నారు. ఓపీలో కూర్చోవడం లేదు. ఏసీ గదుల్లో కూర్చొని విశ్రాంతి తీసుకుంటున్నారు. తమకేం పట్టదన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారు. వైద్యం కోసం దూరప్రాంత్రాల నుంచి వచ్చిన రోగులు అవస్థలు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు పట్టించుకోవడం లేదు. కేఎస్ఎస్ బాధ్యతారాహిత్యం వైద్యులకు వరంగా మారుతోంది. వివిధ ఓపీల్లో ఉదయం 9 నుంచి 4 గంటల వరకు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు.. పీజీలకు అప్పగించి పత్తా లేకుండా పోతున్నారు. దీంతో రోగులకు నాణ్యమైన వైద్యం దూరమవుతోంది. ఒక్క మాటలో చెప్పాలంటే పీజీ విద్యార్థులతో కొందరు వైద్యులు ప్రయోగాలు చేయిస్తున్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆస్పత్రిలో రోగుల పట్ల వైద్యుల నిర్లక్ష్యంపై దృష్టి సారిస్తే బాగుంటుందని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి.



వైద్యుల కోసం ఎదురు చూస్తున్న తల్లులు

ఏసీ గదులకే పరిమితం..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయి. కేవలం 30 పీజీ సీట్లతో ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలకు ఏకంగా గడిచిన ఐదేళ్లలో పీజీ సీట్ల సంఖ్య వంద దాటింది. ఇప్పుడు 300 మంది పీజీలు విద్యనభ్యసిస్తున్నారు. కాగా ఆస్పత్రిలోని మెడిసిన్, సర్జరీ, పీడియాట్రిక్, పల్మనాలజీ, సర్జరీ, ఈఎన్‌టీ, ఆప్తమాలజీ, రేడియాలజీ, సైకియార్టీ, డర్మటాలజీ, తదితర విభాగాల ఓపీ రోజూ జరుగుతుంది. ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజల నుంచి వేల సంఖ్యలో ఓపీకి రోగులు వస్తుంటారు. కాగా ఇక్కడున్న అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్లలో అధిక సంఖ్యలో ఓపీలకు రాకుండా వారి ఏసీ గదుల్లో తిష్ట వేస్తున్నారు. తమకేం పట్టదన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారు. ఇక్కడ పీజీ వైద్యులు రోగులకు దిక్కయ్యారు. వాస్తవంగా వివిధ కేడర్లలోని వైద్యులు అందుబాటులో ఉంటే రోగి పరిస్థితిని లోతుగా తెలుసుకుని, నాణ్యమైన వైద్యం అందించడానికి వీలుగా ఉంటుంది.

ప్రైవేట్ క్లినిక్‌లపై దృష్టి

పక్క జిల్లా కర్నూలు తరహాలోనే ఇక్కడ వందల సంఖ్యలో పీజీ సీట్లు ఉన్నాయి. ఇక్కడి వైద్యులు పీజీలు ఉంటే పరిశోధనలు చేయవచ్చని ప్రగల్భాలు పలికిన దాఖలాలు ఉన్నాయి. పరిశోధనలను పక్కన ఉంచితే కనీసం ఓపీల్లో కూర్చోకుండా ప్రైవేట్ క్లినిక్‌లపై దృష్టి సారిస్తున్నారు. కొందరు వైద్యులైతే ఏకంగా సెల్‌ఫోన్లు చూసుకుంటూ ఓపీల్లో కూర్చుంటున్నారు. ఇంతటి దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయి.

సూపరింటెండెంట్, డిప్యూటీ ఆర్ఎంఓల వైఫల్యం

ఆస్పత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంలో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, డిప్యూటీ ఆర్ఎంఓలు డాక్టర్ పద్మజ, డాక్టర్ హేమలత, తదితరుల వైఫల్యం స్పష్టంగా కన్పిస్తోంది. వీరు హడావుడి చేయడం తప్పితే ఆస్పత్రిలో సిబ్బంది పని చేస్తున్నారా? లేదా అని పరిశీలించిన దాఖలాలు లేవు.





ఆప్తమాలజీ (కంటి) ఓపీల్లో ఖాళీగా ఉన్న వైద్యుల కుర్చీలు, పల్మనాలజీ ఓపీలో సెల్‌ఫోన్ చూసుకుంటున్న సీనియర్ వైద్యుడు, మందులు రాస్తున్న హౌస్‌సర్జన్


తూతూమంత్రంగా తనిఖీలు..!



సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఏడీ మల్లికార్జున రెడ్డి తదితరులు ఫార్మసీని తనిఖీ చేస్తున్న సమయంలో కనిపించని ఫార్మసిస్టులు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని గైనిక్, లేబర్, ఓపీ నంబర్ 1, 2, ఫార్మసీలను సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఆస్పత్రి ఏడీ మల్లికార్జున రెడ్డి తనిఖీ చేశారు. కాగా అక్కడకు వెళ్లిన వీరు విధుల్లో ఎవరున్నారని ఆరా తీయలేదు. ఫార్మసీలోకి వెళ్లిన సమయంలో నలుగురు ఫార్మసిస్టులు అందుబాటులో ఉండాల్సి ఉండగా.. ఇద్దరు మాత్రమే ఉన్నారు. మూడు కౌంటర్లలో శిక్షణ పొందుతున్న విద్యార్థులే రోగులకు మందులు ఇస్తున్నారు. ఎక్కడైనా ఫార్మసిస్టుల పర్యవేక్షణలో విద్యార్థులు మందుల పంపిణీ చేయాలి. కానీ అటువంటి పరిస్థితి లేదు. పొరపాటున ఒక మాత్ర ఇచ్చేది మరొక మాత్ర ఇచ్చినా రోగులకు ఇబ్బంది తలెత్తే అవకాశం లేకపోలేదు. ఫార్మసిస్టులు కూడా తరచూ విధులకు డుమ్మా కొడుతున్నా.. సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు వారికి అండగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది. ఆస్పత్రిలో అత్యవసర మందుల కొనుగోళ్లలో (ఎమర్జెన్సీ, లోకల్ పర్చేజ్) కొందరు ఫార్మసిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నారన్న విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో ఫార్మసిస్టులను అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది.

జగనన్నతో భేటీ



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలసిన వైఎస్సార్‌సీపీ నేత ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: విజయవాడలో మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని అనంతపురం వైఎస్సార్‌సీపీ నేత, యువజన విభాగం మాజీ జిల్లా అధ్యక్షుడు ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధినేత వైఎస్ జగన్‌కు ఆయన పూలమొక్క అందజేశారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డిని అధినేత వైఎస్ జగన్ ఆదేశించారు.

ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య



మాట్లాడుతున్న ఏడీఏ రవి

రాప్తాడు: నియోజకవర్గంలోని భూమి గల ప్రతి రైతుకూ ప్రత్యేక గుర్తింపు విశిష్ట సంఖ్యను కేటాయిస్తున్నట్లు అనంతపురం వ్యవసాయ శాఖ ఏడీఏ రవి తెలిపారు. గురువారం మండలంలోని రాప్తాడు, గొందిరెడ్డిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సేవలను పొందడానికి ఈ సంఖ్య అధికారిక గుర్తింపుగా పనిచేస్తుందన్నారు. దీని వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. అర్హులైన భూగి గల రైతులు గుర్తించడంతో తోడ్పడి, వారు ప్రభుత్వం నుంచి వచ్చే సబ్సిడీలు, పంటల బీమా వంటి ప్రయోజనాలు పొందేలా చేస్తుందన్నారు. రైతులు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి, రైతు గుర్తింపు సంఖ్యను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్రీవాణి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో సత్తా



అమ్మినాతాజ్

అనంతపురం: పూణేలో ఈనెల 8, 9 తేదీల్లో జరిగిన జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో అనంతపురం నగరానికి చెందిన ఏ.అమ్మినాతాజ్ సత్తా చాటింది. తొలి రౌండ్‌లో సిల్వర్, రెండు, మూడో రౌండ్‌లలో రజతం పతకం సాధించింది. కేవలం 7 సంవత్సరాల వయస్సులోనే జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటడంతో తల్లిదండ్రులు ఖలీల్‌బాషా, షేక్ రుబీనా హర్షం వ్యక్తం చేశారు.

కార్పొరేట్ దోపిడీని అరికట్టాలి



డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం మెడికల్: ఎన్టీఆర్ వైద్య సేవ పేరుతో కార్పొరేట్ ఆస్పత్రులు చేస్తున్న దోపిడీని అరికట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీని నిరసిస్తూ గురువారం డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. గత నెలలో బస్టాండ్ పరిసర ప్రాంతంలో ఉన్న ఓ కార్పొరేట్ ఆస్పత్రి ఎన్టీఆర్ వైద్య సేవ లేదంటూ.. శ్రీనగర్ కాలనీ సమీపంలో ఉన్న ఓ ప్రముఖ ఆస్పత్రికి రెఫర్ చేయడం జరిగిందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉన్నా డబ్బులు కట్టాల్సిందేనంటూ సదరు ఆస్పత్రి నిర్వాహకులు తెలపడంతో బాధితుల కుటుంబ సభ్యులు సాయినగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి గుండె చికిత్సలు చేసుకోవాల్సి వచ్చిందన్నారు. రోగుల ప్రాణాలతో ఆటలాడుతున్న కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శి రమణ పాల్గొన్నారు.

నేడు దామోదరం సంజీవయ్య జయంతి

అనంతపురం రూరల్: కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు (ఇన్‌చార్జ్) రాధిక గురువారం తెలిపారు. దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూల మాలు వేసి నివాళులు అర్పించిన అనంతరం సభ ఉంటుందన్నారు. ప్రజా ప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు హాజరుకావాలని కోరారు.

'8 నెలల్లో మీరేం చేశారో చెప్పండి'

అనంతపురం కార్పొరేషన్: 'గత ప్రభుత్వంలో ప్రజలకు ఎటువంటి మేలు జరగలేదంటూ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారు. 8 నెలల కూటమి పాలనలో మీరేం అభివృద్ధి చేశారో చెప్పండి.' అని మేయర్ వసీం ధ్వజమెత్తారు. గురువారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో డిప్యూటీ మేయర్ వాసంతి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి చింతకుంట మధు, అనుబంధ సంఘాల అధ్యక్షులు మల్లెమీద నరసింహులు, సైపుల్లాబేగ్, కార్పొరేటర్లతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పరిశ్రమలు, కంపోస్టు యార్డు తరలింపు, నడిమివంకు రక్షణ గోడలు ఏర్పాటు చేస్తామని ఎన్నికలకు ముందు ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చారు. ఇవాళ వాటిని ఏమాత్రం పట్టించుకోకుండా తిరుగుతున్న నీవు.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధిని ప్రశ్నిస్తావా? వాస్తవాలు తెలుసుకో ప్రసాద్ అని మండిపడ్డారు. ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జిల్లా కేంద్రంలో చరిత్రలో లేని విధంగా రూ.1045 కోట్ల అభివృద్ధి జరిగిందన్నారు. రూ.300 కోట్లలో ఫ్లై ఓవర్ బ్రిడ్జ్, రూ.90 కోట్లతో గుత్తి రోడ్డు, రూ.11 కోట్లతో ఎన్‌టీఆర్ మార్గ్, నగరపాలక సంస్థ సాధారణ నిధులు, ఎన్‌క్యాప్, 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.49.50 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. రూ.300 కోట్లతో నాడు–నేడు కింద జీజీహెచ్‌కు సర్జికల్, ఎంసీహెచ్ బ్లాక్ మంజూరు అయిన విషయాన్ని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వంలో జరగాల్సిన రూ.15 కోట్లకుపైగా పనులకు ఎందుకు జాప్యం జరుగుతోందో చెప్పండి దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. అస్తమానం మైకు ముందుకు రాగానే గతంలో అభివృద్ధి లేదు అని చెప్పడం మానుకోవాలని హితవు పలికారు. లేని పక్షంలో ప్రజాస్వామ్య పద్ధతిలో బుద్ధి చెబుతామని ఎమ్మెల్యే దగ్గుపాటికి చురకలంటించారు. సమావేశంలో కార్పొరేటర్లు శేఖర్ బాబు, రహంతుల్లా, ఇసాక్, కమల్‌భూషణ్, శ్రీనివాసులు, అనిల్‌కుమార్ రెడ్డి, లాలూ, కో–ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, నాయకులు సుబ్బారావు, గంగాధర్, దాదాఖలందర్, దాదూ, రామచంద్ర, బాషా, శీన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ వసీం

మద్యం షాపులో వాటా ఇవ్వలేదని దాడి

- పల్లె అనుచరుల దాష్టీకం
- పుట్టపర్తి బీజేపీ మండలాధ్యక్షుడు భాస్కర్ రెడ్డిపై దాడి



గాయాలపాలైన భాస్కర్ రెడ్డి

అనంతపురం: కల్లు గీత కులాల కోటాలో దక్కిన మద్యం షాపులో తమకు వాటా ఇవ్వలేదని పల్లె రఘునాథ రెడ్డి అనుచరులు వీరంగం సృష్టించారు. ఏకంగా పల్లె రఘునాథ రెడ్డి ముందే పుట్టపర్తి మండలాధ్యక్షుడు భాస్కర్ రెడ్డిపై దాడి చేశారు. వివరాలు.. కల్లు గీత కులాల కోటా మద్యం షాపు టెండర్లలో పుట్టపర్తి మద్యం షాపు శ్యామల అనే మహిళకు దక్కింది. ఆమెకు ఆర్థికంగా సాయం చేసిన వ్యక్తికి వాటా ఇస్తానని ముందుగా హామీ ఇచ్చారు. టెండర్ దక్కిన వెంటనే మరో వ్యక్తికి కూడా వాటా ఇవ్వాలని టీడీపీ నాయకులు కోరారు. నేను ఒకరికి మాత్రమే వాటా ఇస్తానని శ్యామల తెలిపింది. బుధవారం మద్యం తీసుకోవడానికి చివరి గడువు కావడంతో పుట్టపర్తి నుంచి శ్యామలతో పాటు బీజేపీ పుట్టపర్తి మండలాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి బయలు దేరారు. వెల్దుర్తి వద్దకు రాగానే పవన్, రామ్మోహన్ అనే వ్యక్తులు బీజేపీ పుట్టపర్తి మండలాధ్యక్షుడు భాస్కర్ రెడ్డిపై దాడి చేశారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి జోక్యం చేసుకుని గురువారం అనంతపురంలోని తన ఆఫీసుకు రండి.. మాట్లాడదాం. గొడవలు వద్దు అని చెప్పారు. దీంతో మద్యం షాపు టెండర్ దక్కించుకున్న శ్యామల, బీజేపీ పుట్టపర్తి మండలాధ్యక్షుడు భాస్కర్ రెడ్డి అనంతపురంలోని పల్లె ఇంటికి వచ్చారు. పల్లె రఘునాథ రెడ్డి మరొకరికి మద్యం షాపులో వాటా ఇవ్వాలని కోరారు. గతంలో మాట ఇచ్చిన ప్రకారం ఒకరికి మాత్రమే వాటా ఇస్తానని శ్యామల స్పష్టం చేసింది. ఆగ్రహంతో ఊగిపోయిన పల్లె అనుచరులు బీజేపీ పుట్టపర్తి మండలాధ్యక్షుడు భాస్కర్ రెడ్డిపై చేయి చేసుకున్నారు. భౌతిక దాడి చేయడంతో కర్ణభేరి పగిలిపోయింది. గాయాలపాలైన భాస్కర్ రెడ్డిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ సర్వజనాసుపత్రికి తరలించారు. తమకు పల్లె రఘునాథ రెడ్డి నుంచి ప్రాణహాని ఉన్నట్లు భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి



జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డిని సన్మానిస్తున్న క్రిస్టియన్ మైనార్టీ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం అనంతను ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.ప్రసాద్ బాబు, అనంతపురం క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు సతీష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అనంతను సన్మానించారు. అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్రైస్తవులకు ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు తెలియజేయాలన్నారు. ప్రజల పక్షాన పోరాడాలన్నారు. కార్యక్రమంలో క్రిస్టియన్ మైనార్టీ విభాగం గుంతకల్లు అధ్యక్షుడు కిరణ్, తాడిపత్రి అధ్యక్షులు సునీల్, పాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్టతలో యువత పాత్ర కీలకం



మాజీ మంత్రి సాకే శైలజానాథ్‌ను సన్మానించిన పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్

అనంతపురం కార్పొరేషన్: అందరూ సమష్టిగా పని చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని మాజీ మంత్రి సాకే శైలజానాథ్ పిలుపునిచ్చారు. గురువారం మాజీ మంత్రి శైలజానాథ్‌ను ఆయన నివాసంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పార్టీలోకి చేరడంతో అభినందనలు తెలిపి, సన్మానించారు. ఈ సందర్భంగా సాకే శైలజానాథ్ మాట్లాడుతూ.. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశయ సాధనకు యువకులు నిర్మాణాత్మకంగా పని చేయాల్సి ఉందన్నారు. పార్టీ పటిష్టతతో యువత పాత్ర ఎంతో కీలకమన్నారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రజలకు మంచి చేద్దామన్న ఆలోచనతో పార్టీలోకి సాకే శైలజానాథ్ రావడం సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగరాధ్యక్షుడు శ్రీనివాస్ దత్తా, నాయకులు సాకే మహేష్, లోక్‌నాథ్ రెడ్డి, సురేంద్ర, రియాజ్, సాకే కుమార్, చంద్ర, నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి సొమ్ము రికవరీ చేయాలి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

అనంతపురం అర్బన్: ఉపాధి హామీ పనుల్లో అవినీతికి పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. స్వాహా చేసిన సొమ్మును రికవరీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సంఘం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ.. వంద రోజుల ఉపాధి పని పూర్తి చేసుకున్న కుటుంబాలకు ప్రభుత్వం అదనంగా 50 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. ఎండలు తీవ్రమవుతున్న దృష్ట్యా పని ప్రదేశాల్లో కనీస సదుపాయాలు కల్పించాలన్నారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని కోరారు. అడిగిన వారందికీ జాబ్ కార్డు ఇవ్వడంతో పాటు పని చూపాలన్నారు. ఉపాధి పథకం సమర్థవంతంగా అమలుకు, పనుల పర్యవేక్షణకు తగిన సిబ్బందిని నియమించాలన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే దశల వారీగా ఆందోళనలు చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు సోమశేఖర్, కృష్ణ, నారాయణ, భాస్కర్, పెద్దయ్య, ఎర్రినాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ వీసీతో వాధ్వాని ప్రతినిధుల భేటీ

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావుతో వాధ్వాని ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం భేటీ అయ్యారు. జేఎన్‌టీయూ అనంతపురంలోని అధ్యాపకులకు శిక్షణ ఇవ్వడానికి వాధ్వాని ఫౌండేషన్‌తో జేఎన్‌టీయూ అనంతపురం ఉన్నతాధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు. వాధ్వాని ఫౌండేషన్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తుండటంతో త్వరలోనే అవగాహన ఒప్పందం చేసుకోనున్నారు.

నేటి నుంచి సహస్రఘట మహాకుంభాభిషేకం

అనంతపురం కల్చరల్: ఉమ్మడి అనంతపురం జిల్లాలో తొలిసారి నగరంలోని ఆర్‌ఎఫ్ రోడ్డు లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం వేదికగా సహస్రఘట మహాకుంభాభిషేకం శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 14, 15, 16 తేదీల్లో సాగే ఉత్సవాల కోసం ఆలయ పరిసరాలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు పుట్టపర్తి రమణారెడ్డి, ప్రధాన అర్చకులు ఏఎల్ఎన్ శాస్త్రి తెలిపారు. నిత్యం సాంస్కృతిక సంబరాలుంటాయని అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు నాగరాజు, గోపాల్, గుప్తా, ఫ్లెక్స్ రమణ ఏర్పాట్లను పరిశీలించారు.

కళింగర కిలో రూ. 4

కూటమి ప్రభుత్వంలో రైతులు రోడ్లపైకి ఎక్కాల్సిన పరిస్థితి వస్తోంది. గిట్టుబాటు ధర లేక పంటను రోడ్లపైన విక్రయించుకుంటున్నారు. మర్తాడుకు చెందిన రైతు వన్నూర్ వలి నాలుగున్నర ఎకరాల్లో కళింగర పంట వేసుకున్నాడు. ఇందుకోసం రూ.5 లక్షల వరకు ఖర్చు పెట్టుకున్నారు. పంట చేతికి వచ్చే సరికి మార్కెట్‌లో కేజీ 4 రూపాయలకు పడిపోయింది. మార్కెట్‌కు తరలించ లేక ఇలా రోడ్లపై అమ్ముకోవాల్సి వస్తోందని రైతు చెబుతున్నాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:



గుత్తి రోడ్డులో కళింగర కాయలు అమ్ముతున్న రైతులు